



# 'ఓపెన్ హైమర్'కు అవార్డుల పంట



## 96వ ఆస్కార్ పురస్కారాల ప్రదానం

### ఉత్తమ దర్శకుడిగా క్రిస్టోఫర్ నోలన్

### 'ఓపెన్ హైమర్'కు ఏడు అవార్డులు

### ఉత్తమ నటిగా ఎమ్మా స్టోన్



ఎమ్మా స్టోన్

**అణుబాంబు సృష్టికర్తగా ప్రఖ్యాతిగాంచిన భౌతిక శాస్త్రవేత్త జూలియస్ రాబర్ట్ ఓపెన్ హైమర్ జీవితకథ ఆధారంగా ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన బయోపిక్ 'ఓపెన్ హైమర్' చిత్రం ఈ ఏడాది ఆస్కార్ వేడుకల్లో ఏడు అవార్డులను గెలుపొంది అగ్ర భాగాన నిలిచింది. ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకుడు పురస్కారాలను ఈ సినిమా దక్కించుకుంది. సృజనాత్మక దర్శకుడిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న క్రిస్టోఫర్ నోలన్ తొలిసారి ఆస్కార్ అవార్డును గెలుచుకోవడం విశేషం. 'పూర్ థింగ్స్' చిత్రం కూడా నాలుగు విభాగాల్లో అవార్డులను కైవసం చేసుకుంది. 96వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం లాస్‌ఏంజెల్స్ డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరిగింది. హాస్య నటుడు జిమ్మీ కిమ్మెల్ ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. గత ఏడాది 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాట ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ గెలుచుకొని కోట్లాది భారతీయుల కలను నిజం చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది అవార్డుల్లో భారతీయ సినిమాలకు నిరాశే ఎదురైంది.**

#### తొలి ఆస్కార్ అందుకున్న క్రిస్టోఫర్ నోలన్

క్రిస్టోఫర్ నోలన్ పేరు చెప్పగానే ఇన్సోమ్నియా, ది డార్క్ నైట్ , బ్యాట్ మెన్ బిగిన్స్, టెనెట్, మెమెంటో, ఇన్‌సెప్షన్, ఇంటర్‌స్టెల్లార్, డన్‌కిర్క్ వంటి పాపులర్ సినిమాలు గుర్తుకొస్తాయి. ఆయన సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. సుదీర్ఘ కెరీర్‌లో సంచలన చిత్రాల్ని అందించిన ఆయన 'ఓపెన్ హైమర్' చిత్రంతో తొలిసారి ఆస్కార్ అవార్డును గెలుచుకోవడం విశేషం. క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వం వహించిన ది డార్క్ నైట్, ఇన్‌సెప్షన్, ఇంటర్ స్టెల్లార్, డన్‌కిర్క్, టెనెట్ చిత్రాలు వివిధ విభాగాల్లో ఆస్కార్ అవార్డులను అందుకున్నాయి. అయితే ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు కేటగిరిల్లో మాత్రం 'ఓపెన్ హైమర్' చిత్రంతోనే తొలిసారి ఆస్కార్ పురస్కారాలను గెలిచారాయన. 'ఓపెన్ హైమర్' చిత్రం 13 విభాగాల్లో నామినేషన్స్‌కు ఎంపిక కాగా 7 అవార్డులతో సత్తా చాటింది. క్రిస్టోఫర్ నోలన్ తీసిన తొలి బయోపిక్ 'ఓపెన్ హైమర్' కావడం విశేషం.

#### 'ఫాదర్ ఆఫ్ ఆటమ్ బాంబ్' కథ


అణుబాంబు పితామహుడిగా అభివర్ణించే ఓపెన్ హైమర్ సంఘర్షణాత్మక జీవితానికి దృశ్యరూపమే 'ఓపెన్ హైమర్'. రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో (1945) అమెరికా ప్రభుత్వం అణుబాంబు పరీక్షకు సిద్ధమవుతుంది. 'మాన్‌హటన్' పేరుతో ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తుంది. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో నిష్ణాతుడైన ఓపెన్ హైమర్‌కు (కిలియన్ మర్ఫీ) ఆ ప్రాజెక్ట్ బాధ్యతను అప్పగిస్తుంది. ఈ క్రమంలో ఓపెన్ హైమర్ ఎదుర్కొనే సవాళ్లు, జపాన్‌లోని హిరోషిమా–నాగసాకిపై అణుదాడి అనంతరం ఓపెన్ హైమర్‌లో చెలరేగిన మానసిక సంఘర్షణ, అతనిలో కలిగిన పరివర్తన అనే అంశాలతో ఉద్వేగభరితంగా కథ నడుస్తుంది. 'ఓపెన్ హైమర్' ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకత్వం విభాగాలతో పాటు ఉత్తమ సహాయనటుడు, బెస్ట్ ఒరిజినల్ స్కోర్, బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ ఫిల్మ్ ఎడిటింగ్ విభాగాల్లో ఆస్కార్ పురస్కారాలను కైవసం చేసుకుంది.



రాబర్ట్ డౌనీ జూనియర్, డేవైన్ జో రాండాల్ఫ్, ఎమ్మా స్టోన్, కిలియన్ మర్ఫీ

#### 'ఓపెన్ హైమర్'లో భగవద్గీత వివాదం

గత ఏడాది జూలైలో 'ఓపెన్ హైమర్' చిత్రం భారతదేశంలో విడుదలైంది. అయితే ఈ సినిమాలోని ఓ శృంగార సన్నివేశంలో భగవద్గీత శ్లోకాన్ని చదివి వినిపించడంతో సినిమాపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. హిందువుల మనోభావాలను కించపరిచారంటూ పలు సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. అయితే సినిమాలోని ఆ సన్నివేశంపై సెన్సార్ బోర్డ్ సైతం ఎలాంటి అభ్యంతరాలను వ్యక్తం చేయలేదు. ఇదిలా వుంటే ఓపెన్ హైమర్ జీవితంలో భగవద్గీతకు ఎంతో ప్రాముఖ్యత ఉందనే విషయం ఆయన బయోగ్రఫీని పరిశీలిస్తే అర్థమవుతుంది. కాలిఫోర్నియా యూనివర్సిటీలో చదువుతున్న రోజుల్లోనే ఆర్థర్ వై రైడర్ అనే అధ్యాపకుడి ద్వారా ఓపెన్ హైమర్ సంస్కృతాన్ని నేర్చుకున్నారు. భగవద్గీతను ఔపోసన పట్టిన ఓపెన్ హైమర్ తనకు ఇష్టమైన పుస్తకాల్లో భగవద్గీత ఒకటిగా చెప్పేవారు.



క్రిస్టోఫర్ నోలన్



కిలియన్ మర్ఫీ

#### ఎమ్మా స్టోన్‌కు రెండో ఆస్కార్

డార్క్ కామెడీ ఇతివృత్తంగా తెరకెక్కిన 'పూర్ థింగ్స్' చిత్రంలోని నటనకుగాను ఎమ్మా స్టోన్ ఉత్తమ నటిగా అవార్డును అందుకుంది. ఆమెకిది రెండో ఆస్కార్ పురస్కారం. 2016లో 'లా లా లాండ్' చిత్రానికిగాను ఎమ్మాస్టోన్ ఉత్తమ నటిగా తొలిసారి ఆస్కార్‌ను గెలుచుకుంది. స్వీయ అన్వేషణ, స్వేచ్ఛ కోసం ఓ యువతి చేసిన ఖండాంతర ప్రయాణం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సైన్స్, ఫాంటసీ అంశాలతో సాగిన ఈ చిత్రంలో ఎమ్మా స్టోన్ చక్కటి నటనను కనబరచింది. ఇక 'ఓపెన్ హైమర్' చిత్రంలో టైటిల్ రోల్‌ని పోషించిన కిలియన్ మర్ఫీ తొలిసారి ఆస్కార్ అవార్డును అందుకున్నారు. క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వం వహించిన ది డార్క్ నైట్ ట్రయాలజీ, ఇన్‌సెప్షన్, డన్‌కిర్క్ చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించారు కిలియన్ మర్ఫీ.

#### నగ్నంగా ఆస్కార్ వేదికపైకి..

ఆస్కార్ అవార్డుల వేడుకలో సంచలనాలు, సరదా సంఘటనలకు కొదువుండదు. ఈ ఏడాది ఆస్కార్ ప్రదానోత్సవంలో ప్రముఖ హాలీవుడ్ నటుడు రెజ్లర్ జాన్ సీనా వేదికపైకి నగ్నంగా వచ్చి ఉత్తమ కాస్ట్యూమ్ అవార్డు విజేతను ప్రకటించడం హైలైట్‌గా నిలిచింది. అయితే ఈ సమయంలో వేదికపై లైట్లు ఆర్పివేశారు. ఆ తర్వాత సహాయకులు వేగంగా వేదికపైకి వచ్చి జాన్ సీనాకు దుస్తులు అందించారు.

#### మెరిసిన 'ఆర్‌ఆర్‌ఆర్'

గత ఏడాది బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాట ఆస్కార్ అవార్డును గెలుచుకొని భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పింది. తాజా ఆస్కార్ వేడుకల్లో సైతం ఈ పాటను ప్రదర్శించడం విశేషం. ఉత్తమ ఒరిజినల్ సాంగ్‌ను ప్రకటించే సమయంలో తెరపై 'నాటు నాటు' పాటను ప్రదర్శించారు. అలాగే 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని కొన్ని పోరాట ఘట్టాలను కూడా చూపించారు. దీంతో ఆస్కార్ వేడుకల్ని వీక్షిస్తున్న భారతీయ సినీ ప్రియుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

#### ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్

ఈ ఏడాది ఉత్తమ అంతర్జాతీయ చిత్రం కేటగిరీలో హోలోకాస్ట్ డ్రామా 'ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్' అవార్డును గెలుచుకుంది. ఈ అవార్డును గెలుచుకున్న తొలి బ్రిటీష్ చిత్రంగా రికార్డు సృష్టించింది. బ్రిటీష్ దర్శకుడు జొనాథన్ గ్లేజర్ రూపొందించిన ఈ చిత్రం కాన్సన్‌ట్రేషన్ క్యాంపుల్లో నాజీలు చేసిన దురాగతాలకు అద్దం పట్టింది.

#### ఆస్కార్ అవార్డుల విజేతలు..

**ఉత్తమ చిత్రం:** ఓపెన్ హైమర్
**ఉత్తమ దర్శకుడు:** క్రిస్టోఫర్ నోలన్ (ఓపెన్ హైమర్)
**ఉత్తమ నటుడు:** కిలియన్ మర్ఫీ (ఓపెన్ హైమర్)
**ఉత్తమ నటి:** ఎమ్మా స్టోన్ (పూర్ థింగ్స్)
**ఉత్తమ సహాయ నటుడు:** రాబర్ట్ డౌనీ జూనియర్ (ఓపెన్ హైమర్)
**ఉత్తమ సహాయ నటి:** డేవైన్ జో రాండాల్ఫ్ (ది హోల్డోవర్స్)
**ఉత్తమ సినిమాటోగ్రఫీ:** ఓపెన్ హైమర్
**ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్:** 20డేస్ ఇన్ మరియా పోల్
**బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే:** కార్డ్ జెఫర్‌సన్ (అమెరికన్ ఫిక్షన్)
**బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే:** జస్టిన్ ట్రైట్, ఆర్థర్ హరారీ (అనాటమీ ఆఫ్ ఎ ఫాల్)
**ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ :** హోలి వెడ్డింగ్‌టన్ (పూర్ థింగ్స్)
**బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్:** జేమ్స్ ప్రైస్, షోనా హెత్ (పూర్ థింగ్స్)
**ఉత్తమ ఇంటర్నేషనల్ ఫిల్మ్:** ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్
**ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్:** గాడ్జిల్లా మైనస్ వన్
**ఉత్తమ ఒరిజినల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్:** ఓపెన్ హైమర్
**ఉత్తమ ఒరిజినల్ సాంగ్:** వాట్ వాస్ ఐ మేడ్ ఫర్ (బార్బీ)



మధుసూదన చారి, పెద్దింటి అశోక్‌కుమార్, కేటీఆర్, చైతన్య రావు, కుమారస్వామి

## తెలంగాణ నేపథ్యంలో మరిన్ని సినిమాలు రావాలి

''షరతులు వర్తిస్తాయి' పోస్టర్స్, సాంగ్స్ చూపించారు. కంటెంట్ ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. కరీంనగర్ నేపథ్యంగా సినిమా చేయడం సంతోషకరం. తెలంగాణ నేపథ్యంతో మరిన్ని సినిమాలు రావాలని ఆశిస్తున్నా. 'తురుమై వచ్చేయ్..' అనే పాటను విడుదల చేశాను. పాట వినగానే నచ్చేలా ఉంది. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. చైతన్యరావు, భూమిశెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి(అక్షర) దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్‌కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు చెందిన 'తురుమై వచ్చేయ్..' అనే పాటను కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేశారు. పసునూరి రవీందర్ రాసిన ఈ గీతానికి అరుణ్ చిలువేరు స్వరపరచగా, ఎంఎల్ఆర్ కార్తికేయన్ ఆలపించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఎప్పుడూ ఎంతో బిజీగా ఉండే కేటీఆర్‌గారు మాకు టైమ్ ఇచ్చారు. ఇందులోని కీలకమైన గీతాన్ని ఆయన చేతులమీదుగా విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా కేటీఆర్‌గారికి థాంక్స్ చెబుతున్నా. సమస్యలకు భయపడకుండా ఎదిరించి నిలవాలనే స్ఫూర్తిని రగిలించేలా ఈ పాట రూపొందించాం' అని దర్శకుడు చెప్పారు. నందకిశోర్, సంతోశ్ యాదవ్, దేవరాజ్ పాలమూరు, పద్మావతి, శివకల్యాణ్, మల్లేశ్ బలాస్ట్, సీతామహాలక్ష్మి, పెద్దింటి అశోక్‌కుమార్, సుజాత తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మాటలు: పెద్దింటి అశోక్‌కుమార్, సంగీతం: అరుణ్ చిలువేరు, సరేష్ బొబ్బిలి, కెమెరా: ప్రవీణ్ వనమాలి, శేఖర్ పోచంపల్లి, నిర్మాణం: స్టార్ లైట్ స్టూడియోస్ ప్రై.లిమిటెడ్.



## బంపర్ ఆఫర్ కొట్టేసిందా?

ప్రస్తుతం మృణాళ్‌ఠాకూర్ టైమ్ నడుస్తున్నది. సీతారామం, హాయ్ నాన్న విజయాలతో మంచి దూకుడు మీద ఉన్నది ఈ అందాలభామ. ఈ మహారాష్ట్ర అందానికి మరో అద్భుతమైన అవకాశం వరించిందని ఫిల్మ్‌నగర్ టాక్. త్వరలో ప్రభాస్‌కి జోడీగా కనిపించనున్నదట మృణాళ్‌ఠాకూర్. వివరాల్లోకెళ్తే.. ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు హను రాఘవపూడి త్వరలో ఓ పీరియాడికల్ డ్రామా తెరకెక్కించనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ కూడా ఇప్పటికే మొదలైంది. ఈ సినిమాలో కథానాయికగా మృణాల్‌ని ఎంపిక చేశారన్న వార్త సాంఘిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతున్నది. అయితే, దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రాలేదు. అదే నిజమైతే మృణాళ్ రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే. ప్రస్తుతం మృణాళ్ 'ఫ్యామిలీస్టార్'లో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.



## సర్వ సన్నాహాల్లో శౌర్యాంగ పర్వం

బాక్సాఫీస్ వద్ద 'సలార్' సృష్టించిన వేడి ఇంకా చల్లారలేదు. గత ఏడాది విడుదలైన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 715కోట్ల రూపాయల గ్రాస్‌ని వసూలు చేసి ప్రభాస్ స్టామినాను మరోసారి రుజువు చేసింది. ఈ సినిమా చివర్లో సెకండ్ పార్ట్ 'శౌర్యాంగపర్వం' పేరుతో రాబోతున్నదని దర్శకుడు ప్రశాంత్‌నీల్ తెలియజేశారు. ప్రస్తుతమైతే ప్రభాస్ 'కల్కి 2898' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. మరోవైపు మారుతీ దర్శకత్వంలో 'రాజాసాబ్' సినిమా కూడా చేస్తున్నారు. మరి 'శౌర్యాంగపర్వం' ఎప్పుడు? అనేది అభిమానులను వెంటాడుతున్న ప్రశ్న. 'సలార్'లో కీలక పాత్రలు పోషించిన నటులు పృథ్వీరాజ్ సుకుమారన్, బాబీ సింహా విడివిడిగా ఆ ప్రశ్నకు సమాధానాలు ఇచ్చేశారు. 'సలార్' రెండో భాగం షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందని చాలా మంది అడుగుతున్నారు. నాకూ ఆతృతగానే వుంది. త్వరలోనే రెండో భాగం షూటింగ్ మొదలుకానుంది. దానికి సంబంధించిన ఏర్పాట్లను ప్రశాంత్‌నీల్ దాదాపు పూర్తి చేశారు' అని పృథ్వీరాజ్ చెప్పారు. అలాగే, నటుడు బాబీసింహా కూడా ఓ ఇంటర్వ్యూలో 'శౌర్యాంగపర్వం'పై అప్‌డేట్ ఇచ్చేశారు. వచ్చే నెలలో షూటింగ్ ప్రారంభమవ్వనున్నట్టు ఆయన తెలిపారు. వచ్చే ఏడాది సినిమా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నట్టు ఈ ఇంటర్వ్యూలో బాబీ సింహా చెప్పారు. ప్రభాస్ అభిమానులకు ఇది నిజంగా శుభవార్తే అనాలి.

## 'సత్యం' చిత్ర దర్శకుడు సూర్యకిరణ్ కన్నుమూత

సుమంత్ హీరోగా రూపొందిన సూపర్‌హిట్ చిత్రం 'సత్యం'తో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న సూర్యకిరణ్ (48) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం చెన్నయ్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. సూర్యకిరణ్ స్వస్థలం కేరళలోని తిరువనంతపురం. సూర్యకిరణ్ సోదరి సుజిత ప్రస్తుతం బిజీ నటి. కథానాయిక కల్యాణిని సూర్యకిరణ్ ప్రేమవివాహం చేసుకున్నారు. కొన్నేళ్ల తర్వాత వ్యక్తిగత కారణాల వల్ల వారిద్దరూ విడిపోయారు. ఇక సూర్యకిరణ్ విషయానికొస్తే.. అతను బాల్యం నుంచి నటిస్తూనే ఉన్నారు. చిరంజీవి నటించిన పలు చిత్రాల్లో బాలనటుడిగా కనిపించారు. ఆ తర్వాత అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన 'సత్యం' చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారు. తొలి సినిమానే బ్లాక్‌బాస్టర్ కావడంతో సూర్యకిరణ్‌కి అవకాశాలు పోటెత్తాయి. ఆ తర్వాత ఆయన తీసిన ధన 51, బ్రహ్మాస్త్రం, రాజుభాయ్, చాప్టర్ 6 చిత్రాలు ప్రజాదరణకు నోచుకోలేదు. దాంతో వైవాహిక జీవితంతోపాటు, కెరీర్ కూడా డైలమాలో పడింది. అనుకోకుండా ఆరోగ్యం క్షీణించడంతో సూర్యకిరణ్ కన్నుమూశారు. ఆయన మరణం పట్ల తెలుగు చలనచిత్ర నటీనటుల సంఘం, తెలుగు సినిమా దర్శకుల సంఘం సూర్యకిరణ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.





## బతుకు ప్రారంభంలో వినాల్సినది భగవద్గీత

'జీవితాన్ని ఎలా కావాలని కోరుకుంటున్నామో అలా మార్చేది భగవద్గీత. జీవితంలో ఎటు వెళ్లాలని కోరుకుంటున్నామో అటు తీసుకెళ్లేది భగవద్గీత. కృష్ణభగవానుడు బోధించిన భగవద్గీతను ఎందరో మహనీయులు తాత్పర్యం చెడకుండా పునః రచించారు. వారిలో స్వామి ముకుందనంద రాసిన గీత అందరికీ సులువుగా అర్థమయ్యేలా వుంటుంది. యువతను దృష్టిలోపెట్టుకుని చేసిన భగవద్గీత ఇది. బతుకు మొదలుపెట్టేముందు వినాల్సినది భగవద్గీత' అన్నారు ఆర్పీ పట్నాయక్. ఆయన రికార్డ్ చేసిన 'సంపూర్ణ భగవద్గీత' తాత్పర్యంలోని విశ్వరూప సందర్శనం అధ్యాయాన్ని హీరో విశ్వక్‌సేన్ సోమవారం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా పట్నాయక్ మాట్లాడారు. 'ఇది భగవానుడు నాతో చేయించిన కార్యం. నేను నిమిత్తమాత్రుడ్ని. ఈ ప్రయాణంలో తోడ్పడిన వారందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అన్నారు. 'ఈ కార్యక్రమంలో పాల్గొనడం, విశ్వరూప సందర్శన అధ్యాయం నేను విడుదల చేయడం నా అదృష్టం. భగవద్గీత తాత్పర్యం అందరికీ అర్థమయ్యేలా రికార్డ్‌చేసిన ఆర్పీ సార్‌కి థాంక్స్ చెప్పుకుంటున్నాను. ఇది నిజంగా చాలా గొప్ప కార్యం' అన్నారు విశ్వక్‌సేన్. ఇది చిరకాలం నిలిచివుండే ప్రాజెక్ట్ అని దర్శకుడు దశరథ్, జె.కె.భారవి, రఘు కుంచె, సింగర్ కౌశల్య, జెమిని సరేశ్ తదితరులు అన్నారు.

## విజయం తథ్యం..

సత్య మేరుగు, దీపిక జంటగా రూపొందుతున్న చిత్రం 'జయం'. జి.కిరణ్‌కుమార్ దర్శకుడు. కంటూరు రవికుమార్ చౌదరి నిర్మాత. ఆదివారం పోస్టర్ లాంచ్ చేశారు. టి. ప్రసన్నకుమార్, పీపుల్ మీడియా శ్రీధర్, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ అతిథులుగా పాల్గొన్నారు. కథ విన్నప్పుడు అప్పటి 'జయం' మాదిరిగానే ఈ 'జయం' కూడా విజయం సాధిస్తుంది అనిపించిందని, అనుకున్న దానికంటే అద్భుతంగా సినిమా వస్తున్నదని నిర్మాత తెలిపారు. లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుందని దర్శకుడు నమ్మకం వ్యక్తం చేశాడు.





## నాటి దురాగతాలను కళ్లకు కట్టాం

'ప్రజలకు నిజాలు చెప్పడానికే 'రజాకార్' సినిమా చేశాం.' అంటున్నారు దర్శకుడు యాటా సత్యనారాయణ. ఆయన దర్శకత్వంలో గూడూరు నారాయణరెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో బాబీ సింహా, వేదిక, అనుష్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్‌పాండే ప్రధానపాత్రధారులు. ఈ నెల 15న సినిమా విడుదల కానుంది. యాటా సత్యనారాయణ మాట్లాడుతూ ''రజాకార్లు పాల్పడిన దురాగతాలను తెరపై కళ్లకు కట్టినట్టు చూపించాం. 1947 ఆగస్ట్ 15 నుంచి సెప్టెంబర్ 17 వరకు జరిగిన సంఘటనలు ఇందులో చూపించాం. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలు కూడా ఇందులో కనిపిస్తాయి. అలాగే ఆంధ్ర ప్రాంతానికి కూడా ఈ కథతో సంబంధం వుంది' అని తెలిపారు. ఈ సినిమా చేయడానికి ఎంతో రీసెర్చ్ చేశానని, వందల పుస్తకాలు చదివానని, ఈ చరిత్రతో దాదాపు 15 సినిమాలు తీయొచ్చని, అందరి సహకారం వల్లే ఇంత గొప్ప సినిమాను ఇంత బాగా తీయగలిగానని ఆయన అన్నారు.

## 'గామి' మాలో ఆత్మవిశ్వాసం నింపింది



'మాలాంటి కొత్తవాళ్లకు సినిమా తీయడమే పెద్ద విషయం. అలాంటిది మేం తీసిన సినిమా విడుదల అవ్వడం, అది ప్రజాదరణ పొందటం.. నమ్మలేకపోతున్నాం. నిజంగా మాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన సినిమా ఇది'. అన్నారు నిర్మాత కార్తీక్ శబరీశ్. ఆయన నిర్మించిన అడ్వంచరస్ థ్రిల్లర్ 'గామి'. విశ్వక్‌సేన్ కథానాయకుడిగా విద్యాధర్ కాగిత ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చాందినీ చౌదరి కథానాయిక. ఇటీవల విడుదలైన ఈ చిత్రం ఘన విజయం సాధించిందని, విమర్శకుల ప్రశంసలందుకుంటున్నదని నిర్మాత ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంకా మాట్లాడుతూ 'షార్ట్ ఫిల్మ్స్ తీసేవాళ్లందరం ఒకచోట చేరి తీసిన సినిమా 'మను'. ఓ విధంగా 'గామి'కి కూడా అదే స్ఫూర్తి. దర్శకుడు విద్యాధర్‌కి వీఎఫ్‌ఎక్స్‌లో మంచి పట్టు ఉంది. వీఎఫ్‌ఎక్స్ ఎఫెక్ట్సే ఇందులో 70శాతం ఉంటాయి. చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. కానీ బడ్జెట్‌లో క్వాలిటీ గ్రాఫిక్స్‌ని తీసుకురాగలిగాడు విద్యాధర్. విశ్వక్ మార్కెట్ పెరిగాక బడ్జెట్‌ని పెంచాం. అతని సినిమాలు వరుసగా విజయాలు సాధించడం కూడా మాలో ధైర్యాన్ని నింపింది. వి సెల్యులాయిడ్ వారు చేరాక మేం సేఫ్ అనే ఫీలింగ్ వచ్చింది. అందుకే రాజీ పడకుండా సినిమా తీశాం. చూసిన వారంతా సినిమా బావుందని మెచ్చుకుంటుంటే సంతృప్తిగా ఉంది' అంటూ ఆనందం వ్యక్తం చేశారు నిర్మాత కార్తీక్ శబరీశ్.